క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



కారెంపూడి: కారెంపూడిలోని బ్రహ్మనాయుడు కాలనీలో ఉన్న పేదలు, అనాథలకు మాచర్ల వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి తదితరులు శనివారం దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని ట్రస్టు నిర్వాహకుడు గోవిందరెడ్డి తెలిపారు. 50 మందికి చీరలు, పంచెలు, బియ్యం పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



పిడుగురాళ్ల: ది కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే స్వగృహంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ది కొండవీటి రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పందిటి రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, వీరారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



గురజాల : నూతన సంవత్సర వేడుకల్లో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ టి బాలకృష్ణ హెచ్చరించారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని రహదారి మార్గాల్లో మద్యం సేవించరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్ చేయడం వంటివి నిషేధమన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా సహించేదిలేదన్నారు. అర్ధరాత్రి తరువాత ఎవరైనా రోడ్లపై సంచరిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నూతన సంవత్సర వేడుకలను శాంతియుత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఐలు అశోక్ బాబు, ఆనంత కృష్ణ తదితరులున్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని ఏలియంపేట కాలనీలో వంద మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరకులను శనివారం పంపిణీ చేశారు. చింతలపూడి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యులు చింతలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ చింతలపూడి ఆశోక్‌కుమార్‌ల పర్యవేక్షణలో నూతన సంవత్సరం సందర్భంగా సరకులను అందజేశారు. తమ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని డాక్టర్ ఆశోక్ కుమార్ చెప్పారు.

ఈవీఎంల నిర్వహణపై అవగాహన



మాచవరం: ఈవీఎంల నిర్వహణపై ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మాచవరం మండల ఇండిపెండెంట్ తహసీల్దారు, అసిస్టెంట్ కలెక్టర్ కల్పనశ్రీ అన్నారు. మండలంలోని మోర్జంపాడు గ్రామంలో జిల్లా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంల వాడకంపై ఓటర్లకు అవగాహనా కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలోని పోలింగ్ బూత్‌లలో ఓటర్లు, అధికారులతో కలిసి ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలో వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్, గ్రామ పెద్దలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు శనివారం మున్సిపల్ సమావేశం సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాచర్ల చిన ఏసోబుకు వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

నగర పంచాయతీ అభివృద్ధి అందరి బాధ్యత



సమావేశాన్ని నిర్వహిస్తున్న ఛైర్‌పర్సన్

దాచేపల్లి : నగర పంచాయతీ అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అని ఛైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. నడికుడి సచివాలయం కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. నగర పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు అమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ..వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నగర పంచాయతీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని, నగర పంచాయతీ పరిధిలో 3,360మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవటం వలన అవి గ్రామాలుగా రూపాంతరం చెందుతున్నాయని తెలిపారు. నగర పంచాయతీలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేస్తామని, కౌన్సిల్ అమోదం తెలిపిన అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తామని ఆమె వెల్లడించారు. ఈ సమావేశంలో కమిషనర్ వేల్పూరి సత్యనారాయణ, వైస్ ఛైర్మన్లు కొమెరబత్తిన అన్నపూర్ణ, షేక్ మస్తాన్‌బీ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు అపూర్వ స్పందన



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

రెంటచింతల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి యువత నుంచి అపూర్వ స్పందన వస్తుందని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మంచికల్లు, పాలువాయిగేటు గ్రామాలకు చెందిన యువకులకు, బాలికలకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలను ఆమె వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు, యువతకు ఆటల పోటీలను నిర్వహించి వారిలో మెరుగైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా సీఎం జగన్ ఈ పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పోటీల ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు యువత ఎంతో ఉత్సాహంతో పాల్గొనడం సంతోషకరమన్నారు. నిర్వహించిన పోటీలలో విజేతలైన టీంలు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పీఈటీ కత్తి రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మోర్తల ఉమ, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యులు నవులూరి భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు కొమ్మారెడ్డి సతీష్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు శౌరికుమారి, నాగవేణి, పీఈటీలు బ్రహ్మం, కల్యాణి, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు



దాచేపల్లి : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. మండల వ్యాప్తంగా శనివారం జరిగిన పలు క్రీడల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో జరిగిన షటిల్ పోటీలను డిఎల్‌డీవో గబ్రూ నాయక్, ఎంపీడీఓ శోభారాణి, పంచాయతీ కార్యదర్శి నాగేండ్ల రత్నం ప్రారంభించారు. క్రీడాకారులు పోటాపోటీగా షటిల్ ఆడారు. ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో విద్యార్థినులు, క్రికెట్ ఆటలో యువకులు పాల్గొని ప్రతిభను కనబర్చారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీవో గబ్రూనాయక్ కోరారు. ఈ పోటీలను సర్పంచ్‌లు జంగా సురేష్, కూసం నాగిరెడ్డి, వినుకొండ కోటేశ్వరరావు, కర్పూరపు వెంకటకోటయ్య, షేక్ ఇమామ్ వలి, శానంపూడి అంకిరెడ్డి, అనుముల అంజిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

మెరుగైన వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యం



వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న పీవీఆర్

రెంటచింతల: రాష్ట్రంలోని ప్రతి పల్లెకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ గ్రామాన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పశర్లపాడు గ్రామంలో రూ. 20.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, రూ.50 లక్షలు మైనింగ్ నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఆయన సర్పంచ్ షేక్ నన్నే సాహెబ్, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ శౌంతిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరితో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు విద్య, వైద్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి వారికి అండగా ఉన్నారని గుర్తు చేశారు. మాచర్ల నుంచి పీఆర్కేను ఐదో సారి, ముఖ్యమంత్రిగా జగన్‌ను రెండవ సారి గెలిపించాలని కోరారు. సీఎం జగన్ మంచి ఆశయంతో ప్రతి మారుమూల గ్రామంలో సైతం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేసి రూ.25 లక్షల వరకు ఉచితంగా పేదలు కార్పొరేట్ వైద్యసేవలు పొందే అవకాశం కల్పించారన్నారు. ముందుగా ఎస్సీ కాలనీలో మైనింగ్ నిధులు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం పీవీఆర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ షేక్ హసాన్, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ శౌంతిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, పీఏ ఆర్‌డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొట్టం చిన్న బ్రహ్మారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు కొమ్మారెడ్డి సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ వై. చంద్రమ్మ, పార్టీ నాయకులు వెన్నా వెంకటేశ్వరరెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, పమ్మి సీతారామిరెడ్డి, తుమ్మా ఇన్నారెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, వడితే బుడ్డసైదా, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరలు పాల్గొన్నారు.

ఆశాజనకంగా కంది మద్దతు ధర

మాచవరం: ఈఏడాది కంది పంట సాగు ఆశాజనకంగా ఉందని, మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వం కంది మద్దతు ధర రూ.7500లు ప్రకటించిందని వ్యవసాయాధికారిణి కె.రామమ్మ తెలిపారు. కూలీల ఖర్చులు, గోనె సంచులు ప్రభుత్వమే అందిస్తున్నట్లు వెల్లడించారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామ సచివాలయంలో 'కంది పంటసాగులో యాజమాన్య పద్దతులు-కందుల 'సేకరణ' పై రైతులకు అవగాహనా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో సుమారు 3631 ఎకరాల్లో కంది సాగు చేయడం జరిగిందని తెలిపారు. రబీలోనూ కంది సాగు ఆశాజనకంగా ఉందన్నారు. అధిక దిగుబడులకు అవకాశం ఉందని వివరించారు. యాజమాన్య పద్దతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వీఆర్‌ఓ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చిన్న ఆంజనేయులు, యార్డు డైరెక్టర్ రాము, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశంలో అభివృద్ధి ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయంలో శనివారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ అధ్యక్షత వహించి బడ్జెట్ అంశాలను చదివి వినిపించారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రధాన రహదారితోపాటు పట్టణంలోని 33వార్డుల్లో అభివృద్ధి పనులు చేయటం జరిగిందని మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రధాన రహదారిని వెడల్పు చేయటం జరిగిందని, అయినప్పటికీ తోపుడు బండ్ల వారు రోడ్లపైకి రావటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు నివారించాలంటే పోలీస్ శాఖ అధికారులు తోపుడు బండ్ల వారు రోడ్లమీదకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు మెమోరాండం అందించబోతున్నామన్నారు. శానిటేషన్ ఇబ్బందులు కలగకుండా అదనంగా మరో 20 మంది కార్మికులను విధుల్లోకి తీసుకొని శానిటేషన్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు సిబ్బందితో ప్రధాన రహదారి వద్ద డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలన్నారు. వ్యాపారులు వారి షాపుల వద్ద చెత్త, వ్యర్థాలను రోడ్లపై వేయకుండా దాచి ఉంచితే శానిటేషన్ వారు వచ్చి తీసుకు వెళతారని సూచించారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మంచినీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవటం జరుగుతుందని, అలాగే జానపాడు రోడ్డులో రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాటర్ ట్యాంక్ పైపులైన్‌లు కొంత మేరకు తొలగించాల్సి వస్తుందని వివరించారు. ఆ పనులను నిర్వహించేందుకు కావాల్సిన నిధులను సాధారణ నిధుల నుంచి మంజూరు చేయాలని సభ దృష్టికి తీసుకొని వచ్చారు. అజెండాలోని అంశాలను మున్సిపల్ ఏఈ రాఘవేంద్రరావు చదివి వినిపించారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు నూతన సంవత్సర శుభాకాంక్షలను కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ శివశంకర్‌రావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాచర్ల: పట్టణంలోని ప్రతి ఒక్క వినియోగదారుడికి గ్యాస్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ మాచర్ల చిన ఏసోబు, ఫాతిమా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీస్ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు ఉచిత గ్యాస్ పథకం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణబాబు, మెప్మా ప్రాజెక్టు అధికారి ఎం సుబ్బారావు, డ్వాక్రా మహిళలు, ఆర్పీలు తదితరులున్నారు.

మత్స్యరూపం మహిమాన్వితం

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం, వెంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్డులోని అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గోత్ర నామాలతో అభిషేకాలు నిర్వహించారు.

సత్తెనపల్లిలో చేనేత హస్తకళ మేళా ప్రారంభం



చేనేత హస్తకళ ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: దేశ సంస్కృతిలో అంతర్భాగమైన చేనేతలు, హస్త కళలు శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శ్రీ ఉషోదయ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ మేళాను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాలు, హస్తకళా రూపాల ప్రదర్శనను ఏర్పాటు చేసి, విక్రయాలు జరపడం ద్వారా కళాకారుల జీవనోపాధి, వినియోగదారులకు వస్తు నాణ్యత, ధరల్లో లాభసాటిగా ఉంటుందన్నారు. వీటిని కొనుగోలు చేసి చేనేత, హస్తకళ కారులను ప్రోత్సహించాలన్నారు. శ్రీ ఉషోదయ సొసైటీ అధ్యక్షుడు కిషోర్, కార్యదర్శి సత్యనారాయణ, వైఎస్ఆర్ సీపీ మండలాధ్యక్షుడు పురుషోత్తమరావు, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ ఉన్నారు.

పౌర హక్కుల పరిరక్షణకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

రెంటచింతల: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ పౌర హక్కుల పరిరక్షణకు సహకరించాలని ఎస్ఐ సామెల్ రాజీవ్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని రెంటాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన పౌర హక్కుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో మానవ హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతమళ్ల కిరణ్‌కుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇగుటూరి శ్రీనివాసరెడ్డి, వీఆర్వో నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



గ్రామ సభను నిర్వహిస్తున్న తహసీల్దార్

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమేష్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రం దుర్గి జంగాల కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారికి తమ హక్కులను వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని రోజుల క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పర్యటన సందర్భంలో విద్యుత్ సమస్యలను ప్రస్తావించగా వెంటనే ఆయన చర్యలు తీసుకొని విద్యుత్ స్తంభాలను నెలకొల్పినట్లు కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ తహసీల్దార్‌కు వివరించారు. ప్రస్తుతం తాగునీరు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కుల ధృవీకరణ పత్రాల సమస్యను వివరించగా ఆయన వారికి సమాధానం ఇస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు ఇంకా అందలేదని త్వరలోనే కుల ధృవీకరణ పత్రాల సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాణి, విఆర్‌ఓలు టి జీరయ్య, కోటేశ్వరరావు, విఆర్ఎలు కరిముల్లా, ప్రకాష్, సోమ్లానాయక్, బేడబుడగ సంఘం నాయకులు పెద్దిరాజు, ఆలేటి శివ, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధికే తొలి ప్రాధాన్యత

మున్సిపల్ ఛైర్మన్ మాచర్ల చిన ఏసోబు



మాచర్ల: పట్టణంలో పలు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ మాచర్ల చిన ఏసోబు అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన సాధారణ సమావేశంలో పలు అంశాల గురించి చర్చించారు. అధ్యక్షత వహించిన మున్సిపల్ ఛైర్మన్ మాచర్ల చిన ఏసోబు మాట్లాడుతూ పట్టణాభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదన్నారు. ప్రతి అంశాన్ని కూడా పరిశీలించి పరిష్కరించేందుకు కౌన్సిల్ ప్రయత్నిస్తుందన్నారు. ఈ సందర్భంగా నాలుగు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పనులు చేసిన బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయని వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయా వార్డు కౌన్సిలర్లు షేక్ సుభాని, మదార్ సాహెబ్‌లు కోరారు. తప్పక పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు రామాంజనేయరెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, పోలా శ్రీను, గట్ల అరుణ, షేక్ మస్తాన్, మాచర్ల సుందరరావు, మందా సంతోష్, సీహెచ్ అనిత, బత్తిన వేణుతో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి విజేతలతో ఆదర్శ పాఠశాల విద్యార్థులు

కారెంపూడి: స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కౌశల్ పోటీలలో ప్రతిభ చూపారని ఆ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కె ప్రసన్నకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, భారతీయ విజ్ఞాన మండలి సంయుక్తంగా పిడుగురాళ్లలో గత శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్, పోస్టర్ ప్రెజంటేషన్ పోటీలలో పాఠశాల విద్యార్థులు ఇద్దరు ప్రతిభ చూపి నగదు బహుమతులు గెలుచుకున్నారని తెలిపారు. జనరల్ పోస్టర్ విభాగంలో 9వ తరగతి విద్యార్థిని రాజశ్రీ నిధి తృతీయ బహుమతి సాధించారని అలాగే కంట్రిబ్యూషన్ టు సైన్స్ విభాగంలో 10వ తరతగతి విద్యార్థిని ఎ గౌతమి రెండవ బహుమతి సాధించిందని పేర్కొన్నారు. కౌశల్ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్, కౌశల్ జిల్లా జాయింట్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన పాఠశాల సైన్స్ టీచర్ ఎ ప్రసన్న లక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నిబంధనలను అతిక్రమించవద్దు



పట్టణ సీఐ ఆంజనేయులు

పిడుగురాళ్ల: పట్టణంలో నూతన సంవత్సర వేడుకలను పోలీస్ శాఖ నిబంధనల మేరకే నిర్వహించుకోవాలని సీఐ పీవీ ఆంజనేయులు సూచించారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రధాన వీధుల్లో మద్యం సేవించి వాహనాలు నడపటంతో పాటు మైనర్లకు బైక్‌లు ఇచ్చి రోడ్ల మీదకు పంపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు బండి ఇచ్చి పంపే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించరాదని కోరారు. వేడుకల్లో భాగంగా అర్ధరాత్రి దాటిన తర్వాత ఎవరైనా రోడ్ల మీద కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

సత్తెనపల్లి: ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ నాయకుడు మద్ది వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ నూతన అధ్యక్షుడి ఎన్నిక శుక్రవారం రాత్రి జరిగింది. సభా సమావేశానికి మాజీ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్య అధ్యక్షత వహించారు. సభా నిర్వహణ గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పెరుమాళ్ళ లక్ష్మి శివన్నారాయణ చేపట్టారు. ఎన్నికల అధికారులుగా మాజీ అధ్యక్షుడు చందోలు శివ కృష్ణారావు, అధికార ప్రతినిధి బత్తుల మురళీ, రాష్ట్ర నాయకులు కట్టమూరి అప్పారావు, జిల్లా నాయకులు పోతుగంటి నరసింహారావు వ్యవహరించారు. ముఖ్య అతిథిగా సత్తెనపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు హాజరయ్యారు. మద్ది వెంకటేశ్వరరావును రెండేళ్లకు ఏకగ్రీవంగా ఎన్నుకొని, సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సంఘ పటిష్టతకు, రాజకీయాలకు అతీతంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదనరావు, సంయుక్త కార్యదర్శి కొత్తూరి విశ్వేశ్వరరావు, కోశాధికారి కనమర్లపూడి సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు కొత్త లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

నూతన సంవత్సర వేడుకలపై డీఎస్పీ ఆదినారాయణ

సత్తెనపల్లి: న్యూయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ హెచ్చరించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకలు అర్ధరాత్రి ఒంటి గంటలోపే ముగించాలన్నారు. ఆ తర్వాత ఎలాంటి వేడుకలు అనుమతించబడవన్నారు. ఆదివారం అర్ధ రాత్రి ప్రత్యేక తనిఖీలు ఉంటాయని తెలిపారు. రహదారులు, పబ్లిక్ ప్రదేశాల్లో వేడుకలను అనుమతించేది లేదన్నారు. ప్రార్థన ప్రాంతాలు, ఆలయాల వద్ద ప్రత్యేక బందోబస్తు, గస్తీ నిర్వహించడం జరుగుతుందని డీఎస్పీ తెలిపారు. సౌండ్ బాక్స్‌లు, డీజేలు నిషేదమని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టు బడితే కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ద్విచవాహనాల సైలెన్సర్‌లు తీసేసి, విన్యాసాలు చేస్తూ అధిక శబ్దాలు చేస్తే వాహనాలు సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో సన్నిహితులతో, కుటుంబ సభ్యులతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు.